ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (కేశవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 24-2-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీ మనస్సు అనాత్మ విషయాలమీద ఉంటే అక్కడ నుండి నీ మనస్సును ఉపసంహరిస్తేగాని నీకు జ్ఞానం కలుగదు. అనాత్మ విషయములనుండి నీ మనస్సును ఉపసంహరించాలంటే ఆత్మమీద ప్రేమ, భక్తి, విశ్వాసం ఉండాలి. ఆత్మను ప్రేమించకుండా ఆత్మ తెలియబడదు. నీ మనస్సు నిజంకాని విషయాలను నిజంగా చూపిస్తుంది. అది మనస్సు చేసే గారిడీ, దేహాన్ని బట్టి ఇంద్రియాలు వస్తాయి. ఇంద్రియాలను బట్టి విషయాలు వస్తాయి. విషయాలను బట్టి దృశ్యాలు వస్తాయి. అందుచేత దృశ్యాలనుండి నీమనస్సును ఉపసంహరిస్తే గాని అది పరమాత్మ వైపుకు ప్రయాణం చేయదు. తత్వం నీకు తెలుసా అంటారు. అంటే నీవు దేని కోసం అయితే సాధన చేస్తున్నావో ఆ వస్తువు నీవే అన్న సంగతి నీకు తెలుసునా. ఆ వస్తువు నీకు తెలిస్తే అవ్యయసుఖం, అభవసుఖం కలుగుతుంది. మనస్సును తృప్తిపరిస్తే అది పెరుగుతుంది. మనస్సును కంట్రోలు చేస్తే అది అణుగుతుంది. భక్తి యోగం, కర్మయోగం ఇవి అన్నీకూడా మనస్సును అణచటంకోసం. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మ వచ్చింది కాబట్టి దీనిని జాగత్తగా ఉపయోగించుకోవాలి. నీ హృదయంలో బ్రహ్మం ఉంది. గురువు చెప్పిన మాటలను శ్రద్దగా శ్రవణం చేసి ఆవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచెయ్యి. మానవదేహం వచ్చింది కాబట్టి ఈ అవకాశమును సద్వినియోగం చేసుకో. మాయ రెండు విషయాలు కల్పించింది. 1) ధనం 2) సెక్స్ ఇవి రెండూ బలీయమైన శక్తులు. ఇవి రెండూ ఎవడైతే అతిక్రమించాడో వాడు మాయను అతిక్రమించి మనోమూలంలోనికి చేరుకొంటాడు.

మనం ఏ విషయాన్ని అయితే చింతిస్తున్నామో ఆ విషయంలో అజాగ్రత్త పనికిరాదు. జాగ్రత్తగా ఉండాలి. ఎందుచేతనంటే మనం ఏదైతే నిరంతరము చింతిస్తున్నామో అదే మనం అయిపోతాము. భగవంతుని చింతించగా, చింతించగా భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. ఆత్మను విడిచిపెట్టి ఆనాత్మ విషయములను స్మరించటం వలన అడవిలో పడిపోతాము. నీ దేహం ఎక్కడ ఉన్నది అనేది ముఖ్యంకాదు. గురువుతో మానసిక అనుబంధం ఉండాలి. మానసిక అనుబంధం వలన మనస్సు వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతుంది. మానవజన్మరావటం, వచ్చిన తరువాత భక్తికి సంబంధించిన మాటలు వినటం, మనస్సును నిగ్రహించుకోవాలి అనే సహృదయం నీకు కలగటం, పెద్దలు చెప్పిన మాటలు వినటం, విన్న తరువాత వాటిని ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయటం ఇవి అన్నీ కూడా పూర్వజన్మలలో ఎన్నో మంచికర్మలు చేసి ఉంటే నీకు కలుగుతాయి అంటున్నారు ఆచార్యులవారు. మానవదేహంవచ్చి అన్ని అవకాశములు ఇచ్చినప్పటికీ బ్రహ్మంగురించి శ్రవణం చేసి బ్రహ్మంను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయకపోతే వాడు మూర్ఖుడు అంటున్నారు ఆచార్యులవారు. మనం మంచి పనిచేస్తే అందరూ మెచ్చుకోవాలి అనుకోవటం అజ్ఞానానికి మొదటి మెట్టు. సహృదయులు సంతోషిస్తారు. అందరూ మెచ్చుకోరు. ఇది లోకం. ఇందులో మంచివారు, చెడ్డవారు కూడా ఉంటారు. మన కోరికలు ఒక ప్రక్కన పెట్టి ఈశ్వరుడు సంతోషించే పనులు చేస్తే మనస్సు అణుగుతుంది. కొంతమంది ఆడంబరంగా పనులు చేస్తారు. [illegible]ంబరంగా

మాట్లాడతారు. ఏపని చేసినా వారికి గొప్పలు కావాలి. అహంకారమును సంతృప్తి పరచుకోవటానికి పనిచేస్తారు. ఈశ్వరుడు సంతోషించే పనులు చేయరు. వారు మూలంలో కుళ్ళిపోతారు.

నిజమైన భక్తుడు దేవుని చేతిలో పనిముట్టుగా ఉంటాడు. మనపట్లవారు అలా ఉండాలి, వారు ఇలా ఉండాలి అని నిజమైన భక్తుడు అనుకోడు. ప్రహ్లాదుని ఏనుగులచేత త్రొక్కించారు. ఇలా నన్ను త్రొక్కిస్తున్నారు నన్ను రక్షించు అని దేవుని అడగలేదు. చీమకుడితే మనం వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తాము. ప్రహ్లాదుని దగ్గర నేర్చుకోవలసింది ఏమిటి అంటే రాని దానిని వాంచించేది లేదు, వచ్చే దానిని వద్దనేది లేదు. దేవుని సంకల్పమే మన సంకల్పం, దేవుని ఇష్టమే మన ఇష్టం అది ప్రహ్లాదుని భక్తి. యజ్ఞాలు, యాగాలు చేయవచ్చు, దేవునికి గుడులు కట్టించవచ్చు, ఉపనిషత్తులు చదువ వచ్చు, కాశీ, రామేశ్వరం వెళ్ళి అక్కడ దేవునికి పూజలు చేయవచ్చు, గుడులు చుట్టూ తిరగవచ్చు ఇవి అన్ని చేసినంతమాత్రం చేత మోక్షం రాదు, శాంతిరాదు. ఇవి అన్నీ చేయకూడదు అనికాదు. ఇవిచేసి మోక్షం కోసం ఎదురు చూడకండి అంటున్నారు. మీకు ఇష్టమైతే ఇవి అన్నీ చెయ్యండి. వీటి వలన మోక్షంరాదు. ఇప్పుడు మీకు దేహంతో ఏవిధంగా అయితే తాదాప్యం ఉందో అలాగ మీలోపల ఉన్న బ్రహ్మంతో తాదాప్యం వస్తేగాని మీకు మోక్షంలేదు, శాంతి లేదు.

మీరు డబ్బు సంపాదిస్తారు అనుకోండి. ఆ డబ్బును ఖర్చుపెట్టి భోగం అనుభవించటానికి ఎక్కడికైనా వెళతారు. భోగం అనుభవిస్తారు. ఆ డబ్బు ఖర్చు అయిన తరువాత తిరిగి మీ ఊరు వచ్చేసారు. అలాగే మీరు మంచి పనులు చేసి పుణ్యం సంపాదిస్తే వేరేలోకాలలో ఆపుణ్యం అనుభవించవచ్చును. పుణ్యం ఖర్చుఅయిన తరువాత తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే, బ్రహ్మానుభవంపొందటానికి సాధన ఈభూమి మీద చేయవలసిందే గాని మరణానంతరం వెళ్ళే పుణ్యలోకాలుగాని, పాపలోకాలుగాని మీ సాధనకుపనికిరావు. మీ హృదయంలో ఉన్న సత్యవస్తువు మీకు అనుభవంలోనికి రాకపోతే కోటిజన్మలు ఎత్తినా మీకు మోక్షంరాదు. ధనం వలన, గౌరవం వలన ఏదోపని చేయటం వలన మీకు మోక్షంరాదు. లోపల ఉన్న వస్తువు మీద ప్రేమ, భక్తి, ఆవస్తువును తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి. అది తప్పించి నీకు వేరేలోకం ఉండకూడదు. దాని కోసమే జీవించాలి. అవసరమైతే దానికోసమే మరణించాలి. ఈరకంగా ఉంటే ఆవస్తువు మనకు తెలియబడుతుంది. లోకాన్ని ప్రేమిస్తున్నారు అనుకోండి. రూపదృష్టితోటి, నామదృష్టితోటి ప్రేమించకూడదు. లోపల ఉన్న వస్తువును చూసి ప్రేమించాలి. ఏదో ఆశించి పని చేయకూడదు. కోరికతో పని చేస్తే కోరిక నెరవేరవచ్చునుగాని మోక్షం రాదు. నీకు ఉన్న విద్య నిజమైతే వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తావు, దానిని పొందుతావు.

గొప్పల కోసం ఏదీ చేయకూడదు. మనం చేసేది ఏదో నిర్మలంగా చేసి వదలివేయాలి. ఎదుటి వారు మెచ్చుకొంటారు అని ఎప్పుడూ ఏ పని చేయకూడదు. దానివలన తిప్పలు వస్తాయి. ఎదుటి వారు గొప్పగా చెప్పుకోవాలి అనుకోవటం వలన మనకు జ్ఞానం పెరగదు, అజ్ఞానం పెరుగుతుంది. మీ సంతోషం కోసం ఏ బాహ్యవిషయాల మీద ఆధారపడి ఉంటున్నారో వాటిని ఊడగొట్టండి అంటున్నారు. వాటి మీద నుండి మీ మనస్సును ఉపసంహరించండి లేకపోతే వచ్చేజన్మలో మీరు పుట్టిన వెంటనే ఆవిషయములతోనే ఉంటారు. నీ అలవాట్ల నుండి మనస్సును ఉపసంహరించకపోతే అది ఆత్మవైపుకు ప్రయాణం చేయదు. మంచి పనులు చేయటం వలన నీమనస్సు నిర్మలం అవుతుంది, చల్లబడుతుంది అంతేగాని మీరు మంచి పని చేయటం ద్వారా జ్ఞానాన్ని ఆశించవద్దు, ఆశించినా రాదు అని చెపుతున్నారు. వచ్చేది చెపుతున్నాడు.

రానిది చెపుతున్నాడు. మనకు సరి అయిన అవగాహన కోసం ఈ పనిచేస్తే ఈ లాభం వస్తుంది, ఈ నష్టం వస్తుంది అని రెండూ చెపుతున్నాడు. గురువు యొక్క ఆప్యాయత చూడండి. ఏది ఆత్మ, ఏది అనాత్మ, ఏది సత్యం, ఏది అసత్యం అనే వివేకం నీకు లేకపోతే, వైరాగ్యం నీకు లేకపోతే నీవు కోట్లాది మంచిపనులు చేసినా జ్ఞానం రాదు. నీహృదయంలో ఉన్న వస్తువు నీకు ఎప్పుడైతే అనుభవంలోనికి వచ్చిందో అప్పుడు భయం నశిస్తుంది, ద్వైత బుద్ధి నశిస్తుంది, జననమరణాలు ఆగిపోతాయి. అప్పుడు నీవు ఒడ్డుకు వచ్చేస్తావు. శాంతికుటీరానికి చేరుకొంటావు. ఎక్కడకు వెళ్ళిన తరువాత తిరిగిరావలసిన పని లేదో అదే మన నిజమైన ఇల్లు. మనకు జ్ఞానం కలిగితే నిజమైన ఇంటికి వెళ్ళిపోతాము. మీ నిజమైన ఇల్లు మోక్షం. మన సుఖం కోసం, శాంతికోసం ఎంతకాలమైతే దేహం మీద, ఇంద్రియాలమీద, లోకం మీద ఆధారపడి ఉన్నామో అంతకాలం జన్మలు వస్తాయి. రాబోయే విషయాల గురించి ఆత్రుత వద్దు. జరిగిపోయిన విషయాల గురించి బెంగవద్దు. వర్తమాన కాలమును ఉపయోగించుకోండి. జ్ఞానమును సంపాదించుకోండి. భగవంతుని మీద భారం వేసి జీవించటం నేర్చుకోండి. అలా నేర్చుకొంటే నిప్పుమీద నీరు పోస్తే అది ఎలా చల్లారిపోతుందో అలా నీ మనస్సు చల్లారిపోతుంది, అణిగిపోతుంది, దాని లోయలలోనికి అది కూరుకుపోతుంది. మాయ యొక్క ప్రభావమును దాటిన వెంటనే ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. మాయ భగవంతుని చేతిలో ఉంది. భగవంతుని ఆశ్రయిస్తే మాయ దారి ఇస్తుంది.

## (శివదేవుని చిక్కాలలో శ్రీనాన్నగారి ప్రవచనము, 3-3-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు చేసే పూజవలన, జపంవలన, ధ్యానంవలన మాత్రమే మీకు జ్ఞానం వస్తుంది అని అనుకోవద్దు. ఇవి అన్నీ చేసుకోండి. కాని ఇవి చేసినంత మాత్రం చేతనే మీకు జ్ఞానంరాదు. మీలో ఉన్న బేధబుద్ధి నీవు, నేను అనే వేరుబుద్ధి నశిస్తేగాని మీకు జ్ఞానంరాదు అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఇలా చెపుతూ ఉంటే సబ్జెక్టును సరిగా అర్థం చేసుకోకుండా అయితే ఇంక మేము ఏమిచేయాలి అని అడుగుతున్నారు. ముందు సబ్జెక్టును సరిగా అర్థం చేసుకోవాలి. సబ్జెక్టును శ్రవణం చేయటానికి కూడా కొంత అర్హత ఉండాలి. ఆచార్యుల వారు చెప్పేది ఏమిటి అంటే నీకు రోగం వచ్చింది అనుకో. మందులు మ్రింగుతావు. మందులు మ్రింగటం వలన నీకు ఆరోగ్యం రాదు. మందులు మ్రింగటం వలన నీకు రోగం తగ్గవచ్చు, తగ్గకపోవచ్చును. రోగం తగ్గటం వలన ఆరోగ్యం వస్తుంది. అదే విధంగా నీవు కోటి జన్మలు ఎత్తి పూజలు చేసినా, జపాలు చేసినా, ధ్యానాలు చేసినా నీవు నేను అనే వేరుబుద్ధి నశిస్తే గాని నీకు జ్ఞానం కలుగదు. ఇవి అన్నీ చేయవద్దు అని ఆచార్యులవారు చెప్పటం లేదు. వీటివలన నీలో ఉన్న వేరుబుద్ధి నశిస్తోందా, లేదా అని చూసుకోండి. పూజచేయటమే భక్తి అనుకొంటున్నారు. పూజ ఏవిధంగా భక్తిలో భాగమో నిరంతరము భగవంతుని గురించి శ్రవణం చేయటం, భగవంతుని రూపాన్ని ధ్యానించుకోవటం కూడా భక్తిలో భాగములే. విసుగులేకుండా భగవంతుని గురించి శ్రవణం చేయాలి. ఎవరి గురించి శ్రవణం చేస్తున్నావో, ఎవరి గురించి ధ్యానం చేస్తున్నావో, ఎవరి ప్రీతికోసం నీవు పనులు చేస్తున్నావో వాడు నీకు తెలియబడకుండా ఎలా ఉంటాడు అంటున్నారు ఆచార్యులవారు. అంటే తప్పక తెలియబడతాడు.

సద్గుణాలు కలిగి ఉండటం వలన మనకు రెండు లాభములు. సమాజమునకు సంబంధించినంత

వరకూ ధర్మంగా ప్రవర్తిస్తాము, భగవంతుని తెలుసుకోవటానికి నీకు ఉన్న సద్గుణాలే నీకు సహకరిస్తాయి. అహంభావన నుండి వేరు పడక పోతే నీకు బ్రహ్మభావన కలుగదు. నీవు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకూ అహంకారంలో ఉండవలసిందే, అహంకారం పెట్టే బాధలకు గురికావలసిందే అని ఆచార్యులవారు చెపుతున్నారు. మనం అపార్థం చేసుకోకూడదు. సాధన చేయవద్దు అనికాదు. సాధన యొక్క ప్రయోజనం భగవదనుభవం పొందటం. అంతే గాని సాధన పేరుమీద సాధన చేసే మనస్సును అలంకరించుకోవటం కాదు అని చెపుతున్నారు. కొంతమంది 24గం॥ దేహంచుట్టూ తిరుగుతూఉంటారు. దేహం గురించి తప్పించి వేరే ఆలోచన వారికి ఉండదు. అటువంటి వారికి జ్ఞానం రాదు. రోజూ ఏదో అరగంటో, గంటో పూజచేసి, ధ్యానంచేసి నాకు ఆ వస్తువు తెలియటం లేదు అందువలన లోపల వస్తువే లేదు అని అనుకోవద్దు సత్యవస్తువు నీ హృదయంలో ఉంది. ఆ వస్తువును తెలుసుకొనే వరకూ ప్రయత్నం మానవద్దు. ఉన్నది ఒకటే వస్తువు. దానిని తెలుసుకోవటమే నీ జీవితగమ్యం. మిగతా విషయాలు అన్నీ నీ దేహప్రారబ్ధమును బట్టి వస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. ధనం రావచ్చు, పదవులు రావచ్చు, అవమానాలు రావచ్చు ఇవి అన్నీ నీ దేహప్రారబ్ధమును బట్టి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అనుకొన్నది రాదు, ఉన్నదిపోదు. దేహప్రారబ్ధంలో ఏది ఉందో అది వస్తుంది. నీ ప్రారబ్ధంలో వచ్చేది ఉంటే నీ కోరికతో నిమిత్తం లేకుండానే అది వస్తుంది. నీ ప్రారబ్ధంలో లేనిది నీవు ప్రయత్నంచేసినా రాదు. హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో, ఆ ప్రయత్నంలో అడ్డు వచ్చే వాటిని నువ్వుకాదు నాకు కావలసినది అని వాటిని ప్రక్కకు గెంటివేసి సత్యము కోసం ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో అదే జ్ఞానం సత్యవస్తువును తప్పించి చిల్లర గొడవల మీద గురిపెడితే అది అజ్ఞానం.

నీ శరీరం నిండా ముళ్ళు గ్రుచ్చుకొన్నాయి అనుకో. ఆ ముళ్ళు ఉన్నంత సేపు నీకు బాధగా ఉంటుంది. ఒకో ముళ్ళు, ఒకో ముళ్ళు తీసి బయట పడవేస్తే నీకు బాధ తగ్గుతుంది. అప్పుడు సుఖంగా ఉంటావు. అలాగే కోరికలు అనే బాణాలు, వాసనలు అనే బాణాలు నీ మనస్సును గ్రుచ్చుకొన్నాయి. ఒకో బాణాన్ని, ఒకో బాణాన్ని బయటకు తీసివేస్తే నీకు దుఃఖం నశిస్తుంది. నీవు జ్ఞానివి అవుతావు. నీ మనస్సుకు గ్రుచ్చుకొన్న వాసనలను, కోరికలను బయటకు తీయటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. బాణాన్ని తీయటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావు అనుకో. అది రాకపోతే నీకు బాధ తప్పదు. అదే విధంగా నీవు పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా నీ హృదయంలోని వస్తువు నీకు అనుభవంలోనికి రాకపోతే నీకు అశాంతి తప్పదు, దుఃఖం తప్పదు, జన్మలు తప్పవు. మిమ్మల్ని సాధన చేయవద్దు అని ఆచార్యుల వారు చెప్పటంలేదు. ఇక్కడ విషయమును మీరు సరిగా అర్థం చేసుకోవాలి. నీ ప్రయత్నం వలన బాణాన్ని బయటకు తీసివేస్తే నీకు సుఖం కలుగుతుంది. అదే విధంగా నీసాధన వలన నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలిస్తే నీకు శాంతి కలుగుతుంది, పునర్జన్మ లేని స్థితికి ఎదిగిపోతావు.

కొంతమంది నిలువుగా బొట్లు పెట్టుకొంటారు, కొందరు అడ్డంగా బొట్లు పెట్టుకొంటారు, కొందరు విభూతి రాసుకొంటారు. అంతమాత్రంచేతనే భక్తులు కాదు. మినహాయింపులు లేకుండా భగవంతుని సంకల్పమును గౌరవించినవాడు, హృదయపూర్వకంగా అంగీకరించినవాడు నిజమైన భక్తుడు. భగవంతుని సంకల్పమును అంగీకరించిన వాడికి హెచ్చు తగ్గులు రావు, దుఃఖం రాదు. వాడు నిర్మలంగా ఉంటాడు, శాంతిగా ఉంటాడు. మీ దేహాన్ని ఎవరైతే సుఖపెడుతున్నారో వారి యందు ప్రేమకలిగి ఉంటున్నారు. మీ కోరికలను ఎవరైతే సంతృప్తి పరుస్తున్నారో ఆ మనుషులపట్ల, వస్తువులపట్ల ప్రేమకలిగి ఉండి మనస్సులో

వారిని అంటిపెట్టుకొని ఉంటున్నారు. భగవంతుని మర్చి పోతున్నారు. మీతలంపులు, ఆశయాలు, ఊహలు అన్నీ దేహం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అదే సర్వస్వం అనుకొంటున్నారు. అదే సత్యం అనుకొంటున్నారు. అక్కడికే మీ బుద్ధి కట్టుబడి ఉంటోంది. ఇలా దేహానికే పరిమితమైన బుద్ధి ఉన్నంతకాలం మీకు జన్మించటం తప్పదు, మరణించటం తప్పదు ఈ సంసార ప్రవాహంలో నుండి ఎవరూ మిమ్మల్ని ఒడ్డుకు తీసుకొని రాలేరు. ఎవడి దేహాన్ని వాడు సుఖపెట్టుకోవటమే పని ఇంక వేరే పని ఏమీ లేదు. సాధారణంగా సంసారంలో జరిగేది ఇదే. ఏదైతే సత్యంకాదో దానిలో నుండి మానసికంగా వేరుపడటం నేర్చుకో.

ఇతరులను విమర్శించే కొలది తమోగుణం, రజోగుణం పెరిగిపోతాయి. నీపని ఏదో నీవు చూసుకో. నీవు నిర్మలంగా ఉండు. దాని వలన సత్వగుణం కలుగుతుంది. ఎవడికైతే సత్వగుణం కలిగిందో వాడు మాత్రమే తన మూలాన్ని వెతకటానికి ప్రయత్నం చేస్తాడు. నీకు ధనం ఉండవచ్చు, గౌరవం ఉండవచ్చు, నీవు అనేక శాస్త్రములు చదివి ఉండవచ్చు, నీకు అన్ని సదుపాయములు ఉండవచ్చు. నీకు ఎన్ని ఉన్నప్పటికీ లోకంలోని విషయాలు నీ ఇంద్రియాలను ఎంతకాలమైతే ఆకర్షిస్తున్నాయో అంతకాలం నీ మనస్సు ఉపసంహరింపబడదు. నీ మనస్సు ఉపసంహరింపబడితేనే గాని అది హృదయకారం చెందదు. అది హృదయాకారం చెందితేగాని హృదయంలో ఉన్న వస్తువు తెలియదు. విషయచింతనలోనుండి బయటకు రావటం చాలాకష్టం.

జ్ఞానమును సంపాదించుకోవటానికి మనం ఈభూమిమీదకు వచ్చాము. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వచ్చిన పని మర్చిపోయి మనం ఆకర్షణలలో పడిపోతున్నాము. విషయాలకు సంబంధించిన వ్యామోహం తగ్గితేగాని, మోక్షమునకు సంబంధించిన ప్రయత్నం చేయటానికి మనకు అర్హత కలుగదు. ఎవడైతే ప్రాపంచిక వ్యామోహంలో ఉన్నాడో, విషయాకర్షణలో ఉన్నాడో వాడు ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని యోగములు చేసినా వాడికి శాంతిరాదు, మోక్షంరాదు. వైరాగ్యమనే ఖడ్గం నీచేతిలో ఉన్నప్పుడు మాత్రమే ఈ విషయారణ్యంలో నీకు ఎదురయ్యే వాటిని ఆ ఖడ్గంతో సంహరించి అందులోనుండి బయటకు రాగలవు. ఇందులోనుండి బయటకు రావటం అంత తేలికకాదు. విషయాకర్షణలో నుండి బయటపడటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే నీ ప్రయత్నం నిజమయినపుడు లోపల ఉన్న ఈశ్వరుడు తన శక్తిని పంపిస్తాడు. అప్పుడు అందులోనుండి బయటపడతావు. మీ అహంకారమును రేపుకోవద్దు. భగవంతుని మీద భారం వేసి జీవించటం నేర్చుకోండి అని భగవాన్ శాస్త్రిగారితో అనేవారు. భగవంతుని మీద భారం వేసి జీవించటం నేర్చుకొంటే అహంకారం దానంతట అదే అణిగిపోతుంది. అంటే మీరు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నారో దాని అంతట అదే మీ ప్రయత్నం లేకుండానే అణిగిపోతుంది.

## (పాలకోడేరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 9-3-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దానిని మాయనేను అంటారు. ఈ మాయనేను అడుగున అసలు నేను ఉంది. మనం మాట్లాడుకొంటున్నాము అనుకోండి. మనం పనిచేస్తున్నాము అనుకోండి. ఆ మాటలకు పనికి కేంద్రం అహంభావన. సర్వసాధారణంగా ఒకరిని ఒకరు పొగుడుకొంటూ వారి అహంభావనను సంతృప్తి పరచుకొంటూ ఉంటారు. సమాజంలో జరిగే పని అదే. ఏ అహంభావనను

కేంద్రంగా పెట్టుకొని నీవు పనిచేస్తున్నావో, నీవు మాట్లాడుతున్నావో ఆ అహంభావన నువ్వు కాదని శాస్త్రం చెపుతోంది, గురువు చెపుతున్నాడు. గురువు చెపుతున్నా, శాస్త్రం చెపుతున్నా వినకుండా దానిచుట్టూ తిరుగుతావు ఏమిటి? అహంభావనను విడిచిపెట్టి చూడు దానికి ఆధారంగా ఉన్న పరమాత్మ గురించి నీకు తెలుస్తుంది. దేనిని విడిచి పెట్టమని పరమాత్మ చెపుతున్నాడో దానిని విడిచిపెట్టిన తరువాత కూడా దేవుడు నీకు కనబడకపోతే అప్పుడు నాకు దేవుడు కనబడటం లేదు అని అడుగు. ప్రహ్లాదునికి దేవుడు లేని చోటులేదు. అంతటా దేవుడే కనిపిస్తున్నాడు అన్నాడు. హిరణ్యకశపుడు నాకు దేవుడు ఎక్కడా కనబడటంలేదు అన్నాడు. స్థూలబుద్ధి ఉన్నవాడికి దేవుడు కనబడడు. సూక్ష్మ బుద్ధి ఉన్నవాడికి, జ్ఞానదృష్టి ఉన్నవాడికి దేవుడు అంతటా కనిపిస్తాడు. ప్రహ్లాదునికి జ్ఞానదృష్టి ఉంది కాబట్టి అంతటా దేవుడు కనిపించాడు. హిరణ్యకశపునికి స్థూలబుద్ధి కాబట్టి దేవుడు ఎక్కడా కనబడలేదు. నువ్వు అహంభావనను విడిచిపెట్టిచూస్తే దేవుడు కనబడతాడు.

సమాజంలో పనిచేసినా, ఇంట్లో పనిచేసినా అహంభావనను ఆధారంగా పెట్టుకొని పనిచేస్తున్నారు. అందువలన అది అణగటంలేదు. భగవాన్ చెప్పిన మార్గం ఏమిటి అంటే దాని గొడవలో కూర్చొంటే దానినుండి బయటకురాలేవు. దాని గొడవ వదిలేసి నేరుగా చైతన్యంను పట్టుకొంటే అహంభావన దాని అంతట అదే పోతుంది. మొక్కకు నీరు పోయటం మానివేస్తే దాని అంతట అదే చచ్చిపోతుంది. మనం చంపనక్కరలేదు. అదే విధంగా నీవు అహంభావన గొడవ వదిలివేసి నేరుగా పరమేశ్వరుని గొడవలో ఉంటే అహంభావన దాని అంతట అదే నశిస్తుంది. మనస్వరూపమే బ్రహ్మం, మనస్వరూపమే ఆత్మ. అయితే అది అనుభవంలోనికి రాకుండా ఈ అహంభావన అడ్డువస్తోంది కాబట్టి దానిగొడవ వదిలివేసి నేరుగా బ్రహ్మంగొడవలోనికి వెళ్ళిపో. అప్పుడు అహంభావన దాని అంతట అదే పడిపోతుంది. అప్పుడు బ్రహ్మమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మీ పనులు శ్రద్ధగా చేసుకోండి. అహంభావనతో తాదాప్యం వదులుకోవటానికి మీరు ఈ భూమిమీదకు వచ్చారు. భగవంతుడు మనకు ఒక అవకాశం ఇచ్చాడు. ఈశరీరం మరణించేలోపు అహంభావనతో తాదాప్యం వదులుకొంటే ఈదేహంలో ఉండగానే పరమేశ్వరుడు మనకు వ్యక్తమవుతాడు. మీరు చేసే పనిలో, మాట్లాడే మాటల్లో అహంభావన కలిసిపోకుండా చూసుకోండి.

మీకు ఏతలంపు వచ్చినా మాయనేనులో నుండి వస్తోంది. ఈ మాయనేను అణిగిపోతే దానిలో నుండి వచ్చే తలంపులు అన్నీ కూడా అణిగిపోతాయి. మీరు అందరూ జ్ఞానులు అవ్వాలంటే ఈ మాయనేను వాడకం తగ్గించాలి. ఈ మాయనేను జోలికి వెళ్ళవద్దు. అది మంచిదికాదు. ఏదైతే మీరు అవునో నేరుగా దాని వంక చూసుకోండి మీరుకాని దాని గొడవ మీకు ఎందుకు? ఇప్పుడు మనం నేను, నేను అంటున్నాము. అది నిజంకాదు. అది కూడా ఒక తలంపే. ఇది జాగ్రదావస్థలో వ్యక్తమవుతోంది. గాఢనిద్రలో మిగిలిన తలంపులు అణిగిపోయినపుడు ఇది కూడా అణిగిపోతోంది. అందువలన ఆతలంపులు ఎంత అసత్యమో ఇదికూడా అంతే అసత్యం. ఇది అసత్యం కాదు అనుకోండి, సత్యం అనుకోండి గాఢనిద్రలో కూడా ఇది అణగదు.

తలంపులను తరువాత నిరోధించుకోవచ్చును. అసలు తలంపులు ఎందుకు వస్తున్నాయి ? నిజంకానిదానిని నిజం అనుకోవటం వలన , చైతన్యంకాని దానిని చైతన్యం అనుకోవటం వలన, మీరుకాని దానిని మీరు అనుకోవటం వలన తలంపులు వస్తున్నాయి. అంటే చిత్తవృత్తి ప్రారంభమవుతోంది. ఈ చిత్తవృత్తిని అణచటానికి యోగం కావాలి. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే దేహానికి రోగం వచ్చిన తరువాత మందులు

వాడటంకంటే దేహానికి రోగం రాకుండా చూసుకోవటం ఇంకా మంచిది అంటున్నారు. చిత్తవృత్తి వచ్చిన తరువాత యోగం అవసరమవుతుంది. అసలు చిత్తవృత్తే లేకుండా ఉంటే యోగంతో పనిలేదు. మీరు కాని దానితో తాదాప్యం పొందకుండా ఉంటే మీకు చిత్తవృత్తి కలుగదు. ఇంద్రియ వ్యాపారం తగ్గించుకొన్నవాడికి ఇంద్రియాలు అణిగిఉంటాయి. మానసిక వ్యాపారం తగ్గించుకొన్నవాడికి మనస్సు అణిగి ఉంటుంది. ఇంద్రియవ్యాపారం, మానసికవ్యాపారం తగ్గించుకొంటే మనస్సు అంతర్ముఖమవుతుంది, వాడికి అంతర్ దృష్టి కలుగుతుంది, నీ మనోమూలం. నీ హృదయంలో ఉంది. అక్కడే దేవుడు ఉన్నాడు. దానిమూలంలోనికి అదివెళితే దేవుడు వ్యక్తమవుతాడు.

మీరు ఇంటి దగర ప్రశాంతంగా కూర్చొని తొలగించుకోవలసిన బలహీనతలు మీలోపల ఏమైనా ఉన్నాయేమో చూసుకోండి. ఏదైనా మీకు కనిపిస్తూ ఉంటే ఇంక మీకు జ్ఞానం రాదు. అలాగని కంగారు పడవద్దు. మీ బలహీనత మీకు తెలుస్తోంది కదా. అది ఉంది అని కంగారు పడిపోవద్దు. దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. తొలగించుకోవలసిన బలహీనతలు మీలో ఇంక ఏమీలేనప్పుడు మీకు జ్ఞానం కలుగుతుంది. విషయ సుఖాలు అల్పమైనవి, స్వల్పమైనవి. సాధన చేసేటప్పుడు నువ్వు ఒక్క విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. సుఖము, శాంతి అనేది సృష్టిలో ఏ వస్తువులోనూ ఏవిషయంలోను లేదు. కాని ఉంది అని నీ మనస్సు భ్రాంతి పడుతోంది. అందుకని నీ మనస్సు బాహ్యముఖానికి వెళుతోంది. దానికి విషయం అర్థమయ్యేలాగ చెప్పు. అర్థమయితే నీ మనస్సు యొక్క వేగం తగ్గుతుంది. సుఖం, శాంతి అనేది చైతన్యంలో ఉంది. చైతన్యం నీలోపలే ఉంది. మీరు ఏదైనా పొరబాటు చేసారు అనుకోండి. అది మరల చేయకుండా ఉండటానికి ప్రయత్నించాలి. అసలు పొరపాటు చేయకుండా ఉంటే మంచిదే. ఇది పొరపాటు అని తెలుసుకొని దానిని మరల చేయకుండా ఉన్నవాడు యోగితో సమానము.

నీవు సృష్టిని చూసేటప్పుడు అంతటా చైతన్యమునే చూడు. నామరూపములు చూడవద్దు. ఆనామరూపములకు ఆధారంగా ఉన్న పరమాత్మను చూడు నీకు వికారం కలుగదు. ప్రహ్లాదుడు ఉత్తమ భక్తుడు. ప్రహ్లాదుడికి ఉత్తమ స్థానం ఎందుకు ఇచ్చారు అంటే ఇది రావాలి , ఇది రాకూడదు అనే చిత్త వికారము అక్కడలేదు. మనం విషయాన్ని నిరోధిస్తాము. ప్రహ్లాదుడు నిరోధించడు, వచ్చిన విషయాన్ని రిసీవ్ చేసుకొంటాడు. దాని నుండి తప్పుకోవటానికి ప్రయత్నం చేయడు. ఏదైతే వస్తోందో దానిని అంగీకరిస్తాడు. అందువలన ఉత్తమ భక్తుడు అయ్యాడు. నీకు జ్ఞానం కలుగకపోయినా, జ్ఞానానికి సంబంధించిన విషయాన్ని అర్థంచేసుకొని ఎదుటివారికి అర్థమయ్యేలాగ బోధిస్తూఉంటే నిన్ను ఉత్తమలోకాలకు తీసుకొని పోతాను తీసుకొని పోయే వాడిని నేనేకదా అని కఠోపనిషత్‌లో యమధర్మరాజు అన్నాడు.

చనిపోయిన వారి గురించి దుఃఖపడవద్దు. బ్రతికున్నవారికి ఇంకా చావురాలేదు ఏమిటి అని బాధపడవద్దు. అది మంచిదికాదు. పైగా మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉంటే వారికి సహాయం చేయటం వలన మీకు జ్ఞానం కలుగుతుంది అని పరమేశ్వరుడు చెప్పాడు. అంటే శరీరం ఉండగా హృదయపూర్వకంగా సేవ చేయాలి. చనిపోయిన తరువాత దుఃఖపడనక్కరలేదు. కనిపించేమనుషులమీదే నీకు ప్రేమలేనప్పుడు కనిపించని దేవుని మీదనాకు ప్రేమ ఉంది ఉంటే ఎవడు నమ్ముతాడు అన్నారు స్వామీజీ. మన సుఖం అంతా దేహం మీద, లోకంమీద ఆధారపడి ఉంది అని అనుకొంటున్నాము. కాని దేహం అణిగిపోయినపుడు, ఈలోకం అణిగిపోయినపుడు కూడా నీ సుఖానికి, శాంతికి ఏమీ భంగంలేదు. ఎందుచేతనంటే గాఢనిద్రలో

నీకు దేహం గొడవలేదు. అప్పుడు నీవు సుఖంగా, శాంతిగా ఉంటున్నావు కదా. నీ సుఖానికి దేహం కారణం కాదు, ఈ లోకం కారణంకాదు, నీ స్వరూపమే సుఖం. మన స్వరూపంలో మనం ఉన్నప్పుడు అహంకారము ఏమీ చేయలేదు. అది కాలిపోయినతాడులా అయిపోతుంది. కాలిపోయినతాడు ఆకారానికి తాడులాకనబడుతుందిగాని అది దేనికి పనికిరాదు. జ్ఞాని యొక్క అహంకారము అలాగే ఉంటుంది. ఉన్నట్లు కనబడుతుంది గాని అది వాడిని బంధించదు.

దేవుడు ఉన్నాడో లేడో నీకు తెలియదు గాని బుద్ధిఉంది అని నీకు తెలుస్తోందికదా. దానిని సమానం చేసుకో. దానిని సమానం చేసుకొంటే పునర్జన్మ హేతువులు అన్నీ కాలిపోతాయి. పుణ్యం ఉన్నా, పాపం ఉన్నా అవి నీకు అనుభవంలోనికి రాకుండానే కాలిపోతాయి. నీవు జ్ఞానివి అయిపోతావు. గురువు అనుగ్రహం నీ మీద ఉంది అనుకో. నీ శరీరంలో నుండి ప్రాణం పోయేటప్పుడు వాడు ఏమి చేస్తాడు అంటే రాబోయే జన్మలకు నీలో ఏకారణములు ఉన్నాయో చూస్తాడు. సూక్ష్మలోకం కల్పించి నీలో ఉన్న బలహీనతలను బయటకులాగి అక్కడవాటిని నీచేత అనుభవింపచేసి వాటిని తొలగిస్తాడు. అలా ఎందుకు చేస్తాడు అంటే నీలో ఉన్న బలహీనతలను నీకు తెలియకుండా బయటకు లాగటానికి అవకాశంలేదు. అందువలన వాటిని బయటకులాగి సూక్ష్మలోకంలో వాటిని నీచేత అనుభవింపజేసి అప్పుడు వాటిని తొలగిస్తాడు.

ఈశరీరం చనిపోయిన తరువాత మేము కొత్త శరీరంలో లెగుస్తున్నాము అని మీరు అనుకొంటున్నారు. మీరు కొత్త శరీరంలో లెగటంలేదు. మీ మనస్సులోనే లెగుస్తున్నారు. ఆమనస్సులో ఉన్న వికారములు వ్యక్తమవ్వటానికి ఒకదేహం కావాలి కాబట్టి ఆమనస్సుకు ఒక దేహం వస్తుంది. మీలోపల దేహబుద్ధి ఉన్నంతకాలం ఏదో తలంపు మిమ్మల్ని కదుపుతూ ఉంటుంది. మీకు దుఃఖం కలుగజేస్తూ ఉంటుంది. దేహం లేని వాడికి రోగంలేదు. అహంభావన లేని వాడికి భావనలేదు. భావన లేకపోతే దుఃఖంలేదు. తలంపు లేకపోతే దుఃఖం లేదు. తలంపులు అన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి? మాయనేనులో నుండి వస్తున్నాయి ఈ మాయనేను ఎవరు? అని ప్రశ్నిస్తే అది ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది. దాని మూలం చూస్తే అది నశిస్తుంది. అది నశించిన వెంటనే నువ్వు పోవు. నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది.

★

(జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 30-4-97)

*Ratna, Palakol. ✆ 22946*